పలుకరించేదు. నెలకోసారి యింటద్దె వసూలు చేసేవాళ్ళూ వచ్చే చంద్రుడిలో ఆమెయే కొత్తదమూ చూళ్ళేకపోయింది.

చంద్రుడు చందనం వాసన ఆమె మీద వెదజల్లలేదు. కింద కుళ్ళు కాలవనుంచి కంపు మెల్లగా మెలికలు తిరుగుతూ అడిగేడు శేఖరం.

రాధా, నన్ను కట్టుకొని సుఖపడ్డావా ! మెల్లగా అడిగేడు శేఖరం.

ఇంటి ఆసామి పెంచిన అద్దెకీ, మంత్రులు పెంచిన పన్నులకీ తన భర్త బాధ్యుడుకాడని తెలుసుకొనే వివేకం ఆమెకుంది.

ఇప్పుడవన్నీ ఎందుకండీ! అంది విసుగ్గా. కాని సుఖపడ్డాను అన్న జవాబు తనకి తెలియని కారణాల వల్ల యివ్వలేక పోయింది.

నన్ను మొదట చూసినప్పుడు నాలో ఏవిటి నిన్నాకర్షించింది? మళ్ళీ అడిగేడు శేఖరం.

మరీ బావుంది వరస, లేని నవ్వు తెచ్చిపెట్టుకుని జవాబిచ్చింది.

నాలో యేం చూసి పెళ్ళాడేవు? దేన్నో గుర్తుకుతెస్తున్నట్టు శేఖరం ప్రశ్నించేడు.

ఆమె జవాబులు చెప్పుకుంటూ దూరంగా శూన్యంలోకి చూస్తే కిటికీ దగ్గరే నిలబడిపోయింది.

నాలో ఏం చూసి నన్ను పెళ్ళాడేరు? మీరు మొదట మమ్మల్నందర్నీ చూసినప్పుడే నన్ను అందర్నీ చూసినట్టే చూళ్ళేదు కదా? అని రాధ అడుగుతుందని శేఖరం ఆశించేడు. కాని ఆమె ఆ ప్రశ్నలు వెయ్యలేదు.

నాటికి వారి వివాహమై సరిగ్గా ఐదేళ్ళు.

**(31.12.1965)**

# రిలీవరు

**"పూ**ర్వ రోజులైతేనా?... పెద్ద పెద్ద మర్చెంట్స్ ఖాళీ చేసేవారు తన కోసం ఫ్రంటు సీటు. ఈ వేళెలా వుందో నా అదృష్టం అనుకున్నాడు తాసీల్దారు రాజేశ్వరావు"

తాసీల్దారు రాజేశ్వర్రావుకి తెగ కోపం వచ్చింది.

రాని బస్సుమీద.

వచ్చి నెత్తికెక్కి కూర్చున్న సూర్యుడి మీద.

ఎప్పుడొస్తాడో తెలీని తన రిలీవరు మీద.

తన ఉద్యోగం గజెట్చేసిన గవర్నమెంటు మీద.

అసలు ఈ మధ్య జరిగినదేదీ అతనికి నచ్చలేదు. ఇంత వరకూ స్వంత ఊళ్ళో, పుట్టిన జిల్లాలో కాలుమీద కాలేసుకొని దర్జాగా రాజాలా ఉద్యోగం చేసుకునేవాడు.

తనుద్యోగం గజెట్ చేసేక, తొలిసారి తన జిల్లా, మరో మూడు జిల్లాలూ తప్పించి బదిలీ చేశారు. 'పిల్లకి పెళ్ళి చేసుకోవాలి బాబోయ్ ట్రాన్సఫరాపం' డన్నాడు. 'కొత్త ఊళ్ళోనే చెయ్ పెళ్ళి' అన్నారు పై అధికార్లు. 'వీళ్ళకిదే శాస్తి' అని నాల్నెల్లు సెలవు పెట్టేశాడు. ఆ వూరు తప్పించు కుందికి.

సెలవ్ ఖర్చు తప్పిస్తే పిల్ల పెళ్ళీ కాలేదు, బదిలీ తప్పలేదు. సెలవాఖర్ని అక్కడికే, మళ్ళీ ఆ వూరే వెళ్ళమని మొండిపట్టు పట్టింది గవర్నమెంటు.

తన ఊరేం గొప్పదని కాదు, ఆ వూళ్ళో మిత్రుల్లా వుండే శత్రువులు, శత్రువుల్లా వుండే మిత్రులూ తప్పిస్తే మూడోరకం మనుషులు కన్పించరు. అన్నిట్లోనూ పాలిటిక్స్. ప్రతిదాన్లో లిటిగేషన్.

కాని ఎంతచెడ్డా తన స్వంతవూరది. అందుకే దాని మీదంత భిమానం తనకి. అందులోనూ తాసిల్దారు పనంటే తమాషా కాదు. కరణాల పేచీలతో మనసబుల మడతలతో నిండి పోయుంటుంది.

మనసబు మీసం చూసి చెప్పేయ్యాలి వాడు మసెప్రోప్రియేటరో కాడో.

కరణం కళ్ళు చూసి కనిపెట్టెయ్యాలి కల్టివేషనేకౌంటు కుకప్ చేస్తాడో లేదో.

ఆ వచ్చే కుర్రముండావాడు చస్తాడు ఈ ఊరి మతలబీ లర్థం కాక, గూడుపురాణీల్లో ఉక్కిరిబిక్కిరైపోతాడు. అందులోనూ డైరెక్టురిక్రూట్ట, నా మొహం కాదూ! గుమాస్తాగా పుట్టి, రివిన్యూ యినస్పెక్టరుగా పెరిగి, తాసిల్దారైన తనకే ఈ ఉద్యోగం లోతుల్లో అడుగు తగల్దం లేదే, ఇంక వాడేం చేసిచస్తాడు. ఎమ్మే పాసై పరీక్ష ల్తగలెట్టినట్టుగాదు తాసీల్దారీ!

ఏదో వాడి ఖర్మాన వాడు పోతాడు. నా ఖర్మాన్నేపోదును. బస్సొస్తే అనుకున్నాడు రాజేశ్వర్రావు.

బట్టతల ఎండలో మెరుస్తూ మండిపోతోంది. ఖద్దరు చొక్కా చెమటకి తడిసిపోయింది. మధ్యాహ్నం పన్నెండైనా పదకొండు గంటల బస్సు తగలడి చావలేదు. బస్సు పోతోందన్న తొందర్లో కరణం వండించినా వడ్డించ నివ్వ కుండా బండిమీ దీవూరొచ్చే శాడు, కేంపెళ్ళి నూర్నించి.

ఆకలికి కడుపుమండిపోతోంది.

ఎండకి నెత్తి మండిపోతోంది.

ట్రాన్షఫర్తల్చుకుంటే గుండె మండిపోతోంది.

కోపానికి ఒళ్లు మండిపోతోంది.

కాని బస్సు తగలళ్ళేదు.

కోపం దిగమింగి చుట్టూ చూశాడు రాజేశ్వర్రావు. కళ్ళు మూసుకొని వో ముష్టాడు చెట్టు చల్లని నీడలో తత్త్వాలు పాడు కుంటున్నాడు. ఎక్కడో సినిమా ఎడ్వర్టైజుమెంటు పాట గాలిలో కరిగి అలలు, అలలుగా, వినిపించీ వినిపించ కుండా విని పిస్తోంది. "గౌరమ్మా నీ మెగుడెవ రామ్మ" అని పడవ్వాడెవరో చెవులు బద్దలుకొట్టేస్తున్నాడు. ఆ గౌరమ్మెవరో తెలీదు కాని ఈ పడవ్వాణ్ణి మాత్రం మొగుణ్ణి చేసుకోదు వీడి గొంతువింటే ననుకున్నాడు, రాజేశ్వర్రావు.

కాని బస్సు రాలేదు. వస్తే మాత్రం తనకి ఫ్రంటు సీటు దొరుకుతుందన్న నమ్మకమేమిటి? టెర్మినస్దగ్గరైతే కండక్టరూ డ్రైవరూ బతిమాలి ఎక్కిస్తారు తన్ని ఫ్రంటు సీట్లో. ఈ మధ్య వూళ్ళో ఎక్కితే తనకు ఫ్రంటు సీటు దొరకదు. అది మాత్రం ఖచ్చితం. ఫ్రంటు సీట్లో వున్న వాడు పకీరు వెధవైనా సరే ఈ రోజుల్లో తనకోసం దిగమంటే దిగడు. పూర్వం రోజులైతేనా? తను రివిన్యూ యిన్స్పెక్టరుగా వున్న రోజులలో కూడా పెద్ద పెద్ద మార్చంట్సే ఖాళీ చేసేసే వారు తన కోసం ఫ్రంటు సీటు. ఈ వేళెలా వుందో నా అదృష్టం అనుకున్నాడు.

వెంటనేఈ వేళ నా అదృష్టం బాగోలేదనుకున్నాడు. బస్సు న్చూడగానే, క్రైమ్ పిక్చర్లో దొంగ వెధవల్లా ఎవడో 'టై'తో సహా టెర్లిన్సూట్లో వుండి నల్లకళ్ళద్దాల్లోంచి ఎవర్ని చూస్తున్నాడో తెలీ కుండా చూస్తూ కూర్చున్నాడు ఫ్రంటు సీట్లో.

వయ్యారంగా కూర్చున్నాడు. హోయలొలకబోస్తూ కూర్చున్నాడు.

'ఛావనీ వెధవని' అనుకుంటూ కండక్టర్చూపించిన మూడో సీట్లో కూలబడ్డాడు రాజేశ్వరరావు. కండక్టరు విజిల్తో టేంకులా చప్పుడు చేస్తూ బైల్దేరింది బస్సు.

పంటకాలువ మీంచి చల్లగాలి పలకరిస్తోంది.

నీలి ఆకాశంలో రెండు కొంగలు అందంగా ఎగురుతు న్నాయి.

దూరంగా కాలువలో పడవతెర చాప, తెగి పడిన తెల్ల మేఘం ముక్కలా వుంది.

కాలువవతల గట్టున నెత్తిన తట్టతో వయ్యారంగా వూగుతూ నడుస్తోంది బిగువు రవిక పల్లెపడుచు.

ఇవేవీ శాంతపర్చలేదు రాజేశ్వర్రావుని. వీట్ని సుస్పష్టంగా చూడ్డానికేనన్నట్టు కళ్ళజోడు తీసి మళ్ళీ పెట్టేసుకున్నాడు. ఫ్రంటు సీటు పింజారీ.

కొన్ని క్షణాలయ్యేక బస్సు కలియజూసేడు రాజేశ్వర్రావు. తన ఎడంపక్క పల్లెటూరి ముసలాడు ఆరిన చుట్ట నోట్లో పెట్టు కొని చొంగ కారుస్తున్నాడు. కుడిపక్క మిల్లు ప్రొప్రయిటరు నిద్రపోతూ తన మీదికి వాలిపోతున్నాడు. తన కెదురుగా వున్న వాడెవడో చెప్పడం కష్టం. కాని బెంగవాడి కళ్ళలో గూడు కట్టుకుంది. పిల్లకి పెళ్ళి చెయ్యాలో ఏవిటో? జాలిపడ్డాడు రాజే శ్వర్రావు. కాని వుండుండి ఎదుటివాడు పంచెలో చేతులు పెట్టి మోకాళ్ళు బరుక్కోవడం రాజేశ్వర్రావు చూసినప్పుడు మాత్రం, జాలి బస్సు దిగిపోయి కోపాన్నెక్కించింది. తన సీట్లో ఎదుటి వాడికి గజ్జుంది కాబోలు. తన మోకాళ్ళకి వాడి కాళ్ళు తగుల్తు న్నాయి. ఛీ, ఛీ గజ్జి వెధవల్ని బస్సెక్కనివ్వకూడదనుకున్నాడు.

అంతవరకూ సర్వ మానవులూ సమానులేనని ఎవరేనా అంటే వినూరుకుండేవాడు రాజేశ్వర్రావు. ఇటుపైని ఎవరైనా ఆ మాటంటే మాత్రం గజ్జి వెధవలూ, చొంగ కార్చే వాళ్ళూ, బస్సులో నిద్రపోయే మిల్లు ప్రొప్రయిటర్లూ మిగతా వాళ్ళతో సమానులు కారని చెప్పేయదల్చుకున్నాడు.

తన ప్రక్కవాళ్ళనీ, ఎదుటి వాళ్ళనీ అసహ్యించుకున్నాక వెనక్కి తిరిగి సీట్లు కలయజూసేడు రాజేశ్వర్రావు. అంతా ఆడ మళయాళం. ఎవరో యిద్దరు వయసొచ్చిన ఆడపిల్లలు మాత్రం స్క్రీన్టెస్టుకి తయారైనట్టు ముస్తాబయ్యేరు – బాంబే హెయిర్ స్టయిల్స్తో, కంపెనీ బాడీల్తో, ఛీ! ఎంత సిగ్గులేదో వీళ్ళ తల్లి దండ్రులకి వీళ్ళకీ జన్మలో సినిమా ఛాన్సు రాస్సరిగదా, మంచి సినిమా చూసి అర్థం చేసుకునే యోగం కూడా లేదనుకున్నాడు. లోతులేని మనుషులు! అంతా పైజిలుగు.

రాజేశ్వర్రావు కెదురుసీట్లో ఒకసారి కూర్చున్నిద్దరు స్టూడెంట్సు సినిమాల డిస్కషనులోకి దిగేరు. వాళ్ళలో ఒకడు పెద్దయ్యేక భగవదనుగ్రహం వుంటే దారాసింగుకి అన్నలాగా, అనుగ్రహం లేకపోతే తమ్ముళ్ళాగా ఔతాడు. రెండో వాడికి మాత్రం వయసు వస్తుంది కాని పెద్దవడు. ఎండిపోయిన బీరకాయలా వున్నాడు. వాళ్ళ డిస్కషన్ సావిత్రీ, సాధనల మీదికి తిరిగింది. ఒకడు సావిత్రి మంచి అభినేత్రనీ, రెండోవాడు సాధన గొప్పదనీ తగువు పెట్టు కున్నారు. ఇద్దరూ సన్నాసులే అనుకున్నాడు రాజేశ్వర్రావు తారలు కాదు! స్టూడెంట్సు.

ఫ్రంటుసీటువాడి సంభాషణ నచ్చనట్టుంది. కళ్ళజోడు తీసి స్టూడెంట్సు వేపు తిరిగి నాక్కారుంది తెల్సా. నా ఖర్మం కొద్దీ ఈ బస్సులో మీతో ఎక్కాల్సొచ్చింది. ఇహ నోర్మూయ్యండి అన్నట్టు చురచుర చూసి మళ్ళీ ముందుకి తిరిగి పోయాడు.

ఆ క్షణంలో రాజేశ్వర్రావుకి చొంగ కార్చేవాడి మీదకన్నా, మిల్లు ప్రొప్రయిటర్మీదకన్నా, స్క్రీన్ టెస్టమ్మాయిల మీద కన్నా, గజ్జివాడిమీదకన్నా, ఫ్రంటు సీటువాడిమీదెక్కువ కోపం వచ్చింది.

బస్సులో ఎవరికి నచ్చింది వాళ్ళు మాట్లాడుకుంటారు. మధ్య వీడెవడు చూపుల్తో ఆక్షేపించడానికి, వీడిక్కారుంటే ఎవడిక్కావాలి? ఏనుగులుంటే ఎవడిక్కావాలి? ఆ యిద్దరు పిల్లల పెళ్ళీ చేసేస్తే తనూ వేస్తాడు వీడి తాతల్లాంటి టెర్లిన్సూట్లు. ఏం ఉద్యోగం వెలబెడ్తున్నాడో వెధవాయ గారు? వేసుకున్న బట్టల థోరణి బట్టి చూస్తే మెడికల్ రిప్రజెంటేటివ్లా వున్నాడు. అంతే, అంతే, ఏం సందేహం లేదు. మందుల సేంపిల్సేవీ డాక్టర్ల కివ్వకుండా వాడే మింగేస్తున్నాడు కాబోలు. మహా ఆరోగ్యంగా ఉన్నాడు, గాడిద కొడుకు రక్తం కన్పిస్తోంది వాడి బుగ్గల్లో, ఆరోగ్యం వెదజిమ్ముతున్నాయ్ వాడి మెరిసే కళ్ళు. పట్టుమని పాతికేళ్ళేనా ఉండవు. ఇంతకీ క్రితం జన్మలో పెట్టిపుట్టి వుంటాడని సర్దిచెప్పుకున్నాడు రాజేశ్వర్రావు.

కాని ఫ్రంటు సీటువాడు బేగ్లోం చేదో ఇంగ్లీషు పుస్తకం తీసి నల్లకళ్ళద్దాలు తీయకుండానే చదువు ప్రారంభించగానే మళ్ళీ చిర్రెత్తుకొచ్చింది రాజేశ్వర్రావుకి. ఎవిటా వెధవ స్టయిలు ఆ చదువేదేదో కళ్ళజోడు తీసి తగులడరాదూ? ఉండ చుట్టుకు పోయి మెడమాత్రం సీటు బేక్ రెస్టుకి తగిలించి, సీటు చివర అంచున మహా సున్నితంగా కూర్చుని, మడ్గారుదగ్గరున్న గజానికి రెండుకాళ్ళూ నిగడ దన్ని కూర్చున్నా డా ఫ్రంటు సీటువాడు. పెద్ద గొయ్యేదైనా వస్తే కిందపడి పచ్చడౌతాడు.

ఈ వేళేం పచ్చడి చేసిందో తన యిల్లాలు. ఇంకో గంటలో తన ఊరు చేరిపోవచ్చు. ఇంకో వారంతో తనకీ, తన వూరికీ ఋణం తీరిపోతుంది. ఆ వచ్చే రిలీవరు ఓ కార్డు ముక్క రాస్వావ గూడదూ? డైరెక్టురిక్రూటు దర్జా వెలగబెడ్తున్నాడు – ఉత్తరం రాయకుండా, పోనీ తనకేం? వాడే బాధపడ్తాడు. వాడెప్పుడొస్తాడో తెలీపోతే బంట్రోతైనా బస్సుదగ్గరకెళ్ళడు. అతగాణ్ణాహ్వానించడానికి.

కాలువలో కాకులు స్నానం చేస్తున్నాయి. శివ, శివ ఏ చావు వార్త వినాలో ఈ వేళ. ఈ బస్సులో ఎవర్ని చంపేమంటావు అని యమధర్మరాజు ప్రత్యక్షమై అడిగితే ఫ్రంటు సీటు వాణ్ణని తడుముకోకుండా ఆ క్షణంలో అనేస్తాడు రాజేశ్వర్రావు.

ఏదో పల్లెటూరులో బస్సాగింది. రోడ్డుతో పందెం వేసుకుని పక్కనే పరిగెడుతోంది పంటకాలువ. కాలువలో అనాయాసంగా పరుగెడుతున్నాయి తెరచాప పడవలు.

పడవ్వాళ్ళ నల్లశరీరాలు ఎండలో మెరుస్తున్నాయి.

రోడ్డు పక్కన ఓ ముస్లిం పిల్లడు వీధి కుక్కతో ఆడుకుంటూన్నాడు. ఆ కుక్క వాడి మొహం అంతా నాకుతోంది ప్రేమగా.

బస్సు బైల్దేరింది. ఇంక తనూరు చేరేసినట్టే. ఏముంది? ఇంకా నాలుగు మైళ్ళు. కాని బస్సు పోతున్న పల్లెలో సంత జరుగుతోంది. ఎటు చూసినా పశువులూ, మనుషులూ కోలాహలంగా వున్నారు. కురుక్షేత్రంలా వుందా సంత. దారివ్వని మనుషుల్నీ, పశువుల్నీ తప్పిస్తూ, వానచినుకుల మధ్య సహదేవుడు గుర్రాన్ని పోనిచ్చినట్లు పోనిస్తున్నాడు బస్సుని డ్రైవరు. రాజేశ్వర్రావు కళ్ళు మూసుకున్నాడు. నిద్రొచ్చేటట్టుంది. పశువుల అరుపులు, మనుషుల కేకలు, పిల్లల ఏడుపు, బస్సు హారను కలిసి ఘోషిస్తున్నాయి.

బస్సు జోరెక్కింది. కళ్ళు మూసుకునే, బహుశా సంతదాటి పోయాం కాబోలనుకున్నాడు రాజేశ్వర్రావు. నిద్ర జాగ్రదావస్థకి మధ్య పొలిమేరలోవున్నాడతను. బస్సు జోరు జాస్తి అవుతోంది. చవంటకి తడిచిన చొక్కాకి గాలి తగిలి హాయిగా వుంది.

ఇంతలోనే హారను మోత – బ్రేకుల చప్పుడు –బండివాళ్ళ అరుపులు–అకస్మాత్తుగా కళ్ళు విప్పిన రాజేశ్వర్రావుకి ఎగురుతున్న చెట్లూ, రోడ్డు కడ్డంగా చెట్లని వెంట తరుముతూ పరుగెత్తే బస్సూ, అన్ని దిక్కులా పరిగెత్తుతున్న రెండెడ్ల బళ్ళూ అన్నీ ఒక్కసారి కనిపించి, మరి కన్పించడం మానేశాయి. పెద్ద చప్పుడుతో.

❖ ❖ ❖

అతను మళ్ళా కళ్ళు విప్పేసరికి మొహానికి కంతా కాయితా లంటిచినట్టుంది. వంట్లో నీరసం జాస్తీగా వుంది. చేతులకి కట్లున్నాయి, బాధగా మూలిగాడు.

“అదృష్టవంతులు, ఏం ఫర్వాలేదు, అన్నీ చిన్న దెబ్బలే. బాగా షాక్ తిన్నాడంతే. రేపు డిచ్ఛార్జి చేసేస్తా” అన్నారు. అతనికి తెలిసిన గవర్నమెంటు డాక్టరుగారు. అప్పటిగ్గాని అతనికి పరిసరాలు పరిస్థితులూ గుర్తుకు రాలేదు. మంచం దగ్గర కాళ్ళ వేపు గుడ్లనీరు కక్కుతూ నిలబడిది తన భార్య. బస్సు దేన్నో గుద్దివేసుంటుంది.

మరే, ఆ ఫ్రంటుసీట్లో వుంటే ఏమయ్యుండేదో? ఊహించ డానికి భయమేస్తోంది అన్నారు, డాక్టరు ఇంగ్లీషులో.

దాంతో బాగా తెలివొచ్చేసింది రాజేశ్వర్రావుకి ఏం? ఏమైంది అని అడిగాడు.

డ్రైవరూ, ఫ్రంటుసీట్లో వున్నాయినా చచ్చిపోయారు. మిగతా అందరికి ప్రాణభయం లేదు.

రాజేశ్వర్రావు మాటాడలేదు.

ద్వారంలోనుండి సాయంత్రం నీరెండ చతురస్రా కారంలో గదిలో పడుతోంది.

పక్షులరుస్తూ తమ యిళ్ళకి వెళ్ళిపోతున్నాయి. మళ్ళీ ఈ ఎండా, ఈ పక్షులూ రేపు వస్తాయి. రేపు తను డిశార్జి ఐపోతాడు.

కాని ఆ ఫ్రంటు సీటువాడికి రేపు లేదు. పట్టుమని పాతికేళ్ల యినా తిరక్కుండానే బలవంతం చావు చచ్చిపోయాడు.

ఆలోచిస్తున్న రాజేశ్వర్రావు ఆ ఫ్రంటుసీట్లో వున్నదెవరో తెలుసా? మీ రిలీవర్ అన్న డాక్టరు మాటకి ఉలిక్కిపడ్డాడు.

ఆ రిలీవర్ని చూడకముందే తిట్టేడు. చూసేక ఆక్షేపిం చాడు.

అతను తనను ఉద్యోగం నుండి రిలీవ్ చెయ్యడానికి వస్తున్నాడు.

ఫ్రంటు సీటు నుండి రిలీవ్ చేశాడు.

మృత్యువు నుండి కూడా రిలీవ్ చేశాడు.

అతను కేవలం రిలీవర్ కాదు, ప్రాణదాత.

సిగ్గుతో చేతుల్తో మొహం కప్పుకున్నాడు.

తాసిల్దార్ రాజేశ్వర్రావుకి తెగ దుఃఖం వచ్చింది.

*(రా.వి. శాస్త్రిగారి కార్నర్ సీటు చదివేక)*

***(31.12.1965)***

# పెట్టుబడి

**చే**తిలో టెస్ట్‌ట్యూబ్ కిటికీ వేపు తిప్పిచూశేడు మధు సూదన్. పచ్చటి యెండపడి అందులోని ద్రవ్యం బంగారు నీరులా ఉంది. అంతవరకూ తన తలమీదున్న కారుమబ్బు విడిపోయినట్టు రిలేఫ్‌తో నిట్టూర్పి అతను వెనక్కి తిరిగేడు. విశాలంగా వున్న ఆ లేబొరేటరి సీసాలూ, గాజుబీరువాలూ, యెటెండరూ తప్పిస్తే ఖాళీగా వుంది. ఒక మూలని స్టూలుమీద బోనులో గడ్డితింటున్న చెవుల పిల్లలు క్లాసులో పకోడీలు తింటూ మేష్టారుకి దొరికి పోయిన బడిపిల్లల్లా తిండి మానేసి అతని వేపు భయంకంటే ఎక్కువ భక్తితో చూశేయి,

మధుసూదన్ లేబరేటరీనుండి తన గదిలోకి వెళ్తున్నప్పుడు ఎర్రతివాసీ అతని జోళ్లచప్పుడు తనకింద దాచుకుంది. అతను గదిలోకి రాగానే యెటెండెంటు అతని నల్ల కోటు తీసి హేంగరుకి తగిలించి వాష్‌బేసిన్ దగ్గర తువ్వాలు పట్టుకొని నిల్చున్నాడు. అతను చేతులూ, మొహం కడుక్కున్నాక, కాఫీ కప్పులో పోసి, డ్రాయరులోనుండి సిగరెట్ కేసూ, లైటరుతీసి టేబులు మీద యాష్‌ట్రే పక్కన పెట్టేడు.

మధుసూదన్ వున్న ముప్పై ఏళ్ళకంటే మరో పదేళ్ళు యొక్క వున్నట్టు కన్పిస్తాడు. జుత్తుబాగా నెరియడం పోటోలో యాభైని దాటిన వాడిలా కనిపిస్తాడు. అతను వేసుకున్న సూట్ బాగా ఖరీదైనదైనా మూడేళ్ళనాటిది. అతని జోళ్ళు బాగా పాలిష్ చేయ బడిననైనా కొత్తవి మాత్రం కావు. అతని నిరంతరాలోచన అతని నుదుట మీద లోతు గీతలుగీసి పోయింది. అతని కళ్ళల్లోని “కలలు చూపు” అతను యీ లోకంవాడు కాడేమో ననిపిస్తుంది. అతను బరువైన మనుషుల్లోనే లెక్క.

సిగరెట్ యింకో నిమిషంలో అయిపోతుందనగా అతను ఎటెండెంటు వేపు చూశేడు. ఎటెండెంటు టేబిలు మీదున్న పోన్ చేశేడు. సిగరెట్ అయిపోయేసరికి కారు వచ్చి లేబొరేటరీ ముందు ఆగింది. కారు దగ్గరకు నడిచి వెళ్లి మధుసూదన్ లిఫ్ట్ ఇవ్వవలసిన స్నేహితుడికోసం ఆగిపోయినట్టు ఆగి, కాంపౌం డులో మౌనంగా వున్న జంతుశాల వేపు చూశేడు. అదే టైముకి. ఉరకలు వేస్తున్న రెండు కుక్కల్ని గొలుసులతో ఆ పూతూ ఒక జవాను పరుగెత్తకొచ్చేడు. ఆ కుక్కలు... తల్లిపోయిన పిల్లలు తండ్రిని చుట్టుకున్నట్టు మధుసూదన్ కాళ్లకు చుట్టుకున్నాయి.